జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 11-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 480 పేజీలు: 4 వెల : రూ.7



# పలాసలో గుప్పుమంటున్న.. సారా

* పలాస ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జోరుగా సారా తయారీ
* ఆ కేంద్రాలపై దాడులు అంతంత మాత్రమే
* నియోజకవర్గంలో గుప్పుమంటున్న సారా
* ఒడిశా నుంచి కూడా రవాణా
* మామూళ్ల మత్తులో నిద్దరోడుతున్న ఎక్సైజ్ శాఖ
* ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోని ఆ శాఖ అధికారి
* శ్రీకాకుళం నుంచి పలాసకు రాకపోకలు
* పలాస ఎక్సైజ్ అధికారిపై సిబ్బంది అసహనం

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు10 (వార్త):** సారా రహిత జిల్లా కోసం ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు ఎక్సైజ్, పోలీసు శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం అమలుకావడంలో లేదు. పలాస ఎక్సైజ్ సీఐ పరిధిలోని మందస, పలాస మండలాల్లో నాటుసారా తయారీ, విక్రయం, రవాణా జోరుగా సాగుతోంది. దీనికితోడు పక్కనే ఒడిశా ఉండడంతో అక్కడి నుంచి కూడా సారా భారీగా ఆంధ్రాకు తరలివస్తోంది. మందస మండలంలోని కొండలోగాం, పట్టులోగాం, పలాస మండలంలోని పెంటిభద్ర, సవర రామకృష్ణాపురంతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో సారా తయారీతో పాటు అమ్మకాలు జోరందుకున్నాయి. కొందరు సారాను తయారు చేసి చిన్నచిన్న ప్యాకెట్లలో రూపంలో బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. మద్యం బెల్టు షాపులు కూడా పుట్టగొడుగుల్లా విస్తరించాయి. టీడీపీ నేత కనుసన్నల్లోనే మద్యం షాపులు ఉండడంతో వాటి నుంచి మద్యం బెల్టు షాపులకు తరలిపోతోంది. ఇవన్నీ కూడా పలాస ఎక్సైజ్ శాఖకు కనిపించడం లేదన్న గుసగుసలు ఉన్నాయి. నెలవారీ మామూళ్లు అందుతుండడంతో వారు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అసలు సారా తయారీకి నల్లబెల్లం విక్రయిస్తున్న వారు ఎవరన్నది కూడా ఎక్సైజ్ పోలీసులు ఆరా తీయడం లేదు. గతంలో సారా, బెల్టుషాపులపై ఎక్సైజ్, పోలీసు శాఖలు విస్తృతంగా దాడులు చేసేవారు. ప్రస్తుతం ఆ దాడులు అంతంత మాత్రంగానే మారాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప దాడులు చేసిన దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ కడుతున్న కేసులను పరిశీలిస్తే ఇది నిజమని అనిపిస్తోంది. పలాస ఎక్సైజ్ సీఐ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నివాసముంటున్నారు. రెండు మూడు రోజులకోసారి ఆయన కార్యాలయానికి వస్తుంటారని ఆ శాఖలోనే సిబ్బందే బహిరంగంగా చెబుతున్నారు. పలాస ఎక్సైజ్ సీఐ తీరుపై కూడా ఆ శాఖలోకి కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# హిజ్రాల ముఠా.. దారిదోపిడీ

* కారులో పారిపోతుండగా మడపాం వద్ద అదుపులోకి * అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టిన నరసన్నపేట పోలీసులు * వీరిపై పలు జిల్లాల్లో కేసులు



**నరసన్నపేట/జలుమూరు, అక్టోబర్ 10 (వార్త):** దారిదోపిడీకి పాల్పడుతున్న హిజ్రాల ముఠాలను పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపించిన ఘటన నరసన్నపేట మండలంలో చోటుచేసుకుంది. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు శుక్రవారం నరసన్నపేటలో దారిదోపిడీ ఘటనకు సంబంధించిన వివరాలకు మీడియాకు వెల్లడించారు. నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన దొంపాక ఆనంద రమణ ద్విచక్రవాహనంపై ఈనెల3న నరసన్నపేట వస్తుండగా, ఉర్లాం సమీపంలో ఐదుగురు హిజ్రాలు అడ్డుకుని చుట్టుముట్టారు. డబ్బులు ఇవ్వాలని, లేకుంటే వదిలేది లేదంటూ వేధించారు. అతని మెడలోని తులం పావు బంగారు గొలుసు బలవంతంగా తెంచేశారు. అలాగే నరసన్నపేట మండలంలోని ఉర్లాం, ఇచ్ఛాపురం మండలంతో పాటు జి.సిగడాం మండలం ఉల్లివలస, పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబెల్లి మండలం సుంకి గ్రామం వద్ద ఇదే తరహాలో దోపిడీలకు పాల్పడ్డారు. ఈ హిజ్రాల ముఠాపై ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల పోలీస్‌స్టేషన్లలో నే కాకుండా తెలంగాణాలోని చౌటుప్పల్ పీఎస్‌లోనూ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ ముఠా కారులో వెళ్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామన్నారు. ఐదుగురు హిజ్రాలతో పాటు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సైలు దుర్గాప్రసాద్, రంజిత్, హెచ్‌సీ దాలినాయుడు ఉన్నారు.



# గర్భిణీకి వైద్యం చేసేందుకు.. వైద్యుడు నిరాకరణ

* ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు 10(వార్త):** నరసన్నపేట పట్టణంలోని తమ్మయ్యపేటకు చెందిన గర్భిణి దేవాది ప్రియాంక శుక్రవారం ఏరియాసుపత్రికి చికిత్స నిమిత్తం రాగా, ఆమెకు వైద్యసేవలు అందించేందుకు ఓ వైద్యుడు నిరాకరించడంతో ఆందోళనకు దారి తీసింది. ఆమెకు ఉమ్మనీరు పోతుండడంతో గతంలో వైద్యం తీసుకున్న వైద్యుడి వద్దకే వెళ్లాలని ఉచిత సలహా ఇచ్చాడు. దీంతో ఆమె తిరిగి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలిపింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బంధువులతో కలిసి ఏరియాసుపత్రికి వచ్చారు. గర్భిణికి వైద్యం అందించకపోవడంపై ఆ వైద్యుడిని నిలదీశారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులకు సైతం సమాచారం అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు అక్కడికి చేరుకుని ఆ గర్భిణీకి వైద్యసేవలు అందించారు. కాగా డాక్టర్ తీరుపై టీడీపీ నాయకులతో పాటు కుటుంబీకులు మండిపడ్డారు.

## మానసిక ఆరోగ్యంతోనే జీవన ప్రగతి సాధ్యం




**కోటబొమ్మాళి, అక్టోబర్ 10(వార్త):** మానసిక ఆరోగ్యంతోనే జీవన ప్రగతి సాధ్యపడుతుందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. గోవిందరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులచే శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆహారం, ఆలోచనలతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగ, ధ్యానం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జీవన ప్రగతి మానసిక ఆరోగ్య సలహాదారులు డీ.జోగారావు, పి.స్వాతి, ఉపాధ్యాయులు తారక రామారావు, సోమశేఖర్, నీలాచలం నాయుడు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాలు, రచ్చబండ పోస్టర్ ఆవిష్కరణ



**కోటబొమ్మాళి, అక్టోబరు 10(వార్త):** వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం మండలం పెద్ద బమ్మిడి పంచాయతీలో "ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం" యొక్క పోస్టర్ ఆవిష్కరణ చేసి అనంతరం చిన్న బమ్మిడి, పెద్ద బమ్మిడి, ఎత్తురాళ్లపాడు గ్రామాల్లో టెక్కలి నియోజకవర్గ ఇంచార్జి పేరాడ తిలక్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు హేమ సుందర్ రాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రామారావు, జెడ్పీటీసీ వెంకటరావు, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ తాతయ్య, ఎంపిటిసి మెండ జగన్, వాన అసిరినాయుడు, తలగాన గణపతి, నాయకులు లక్ష్మణరావు, సోమేశ్వరరావు, అనసూయ, చలపతి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వినోద్, పెడాడ వెంకటరావు, బాగాది దివాకర్, జనార్ధన్ రెడ్డి, వైస్ ఎంపిపి దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్లు ఎంపీటీసీలు కాళ్ళ సంజీవ్, గొద్దు చిరంజీవి, పొన్నాడ మోహన్, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కళలను బతికించడమే ప్రధాన లక్ష్యం



**పలాస, అక్టోబరు 10(వార్త):** అక్కుపల్లి గ్రామంలో శ్రీ రామా సేవా సంఘం ఆధ్వర్యమున గురువారం రాత్రి జుముకల వాయిద్యం కళాకారుడు , చిత్ర పరిశ్రమ ఫోక్ సింగర్ బోనెల ఆసిరయ్య ప్రదర్శించిన సారంగిధర కథ, జానపద పాటలు ప్రేక్షకులను కనువిందు చేసాయి. ఈ సందర్భంగా గ్రామ సంఘం అధ్యక్షులు మోస వరప్రసాదరావు మాట్లాడుతూ దాతలు ఆర్థిక సహకారం, సంఘం నిధులతో మా గ్రామంలో శ్రీనందెన్న ఉత్సవాలు దిగ్విజయంగా చేపడుతున్నామని తెలియజేసారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ తిలారు శిమ్మన్న మేస్త్రి ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేపట్టామని అంతరించిపోతున్న కళలను బ్రతికించడమే సంఘం ముఖ్య ఉద్దేశమని, ఈ ఏడాది ఉత్సవాలకు తమ దాతృత్వంతో దాతలుగా నిలిచిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కాస చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు , జాయింట్ కార్యదర్శి సింగుపల్లి జగన్నాదం, మాజీ యం.పి.టి.సి బర్రి భూపతి, శ్రీ ఆంజనేయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కాస ముకుందరావు , అక్కుపల్లి యువజన సమితి భిలాయి మాజీ అధ్యక్షులు మడ్డు లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులు మొరిపల్లి దేవానంద్, గ్రామ సంఘం సభ్యులు, మహిళలు, యువతీ యువకులు, నందెన్న తల్లి పిన్నాసి క్రాంతి, నాయినోరు, ఆసరోలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి వెంకటరమణారావు కృషి శ్లాఘనీయం



**పలాస, అక్టోబరు 10(వార్త):** పాఠశాల అభివృద్ధికి సీమల వెంకట రమణారావు ఎంతో కృషి చేశారని పలాస మండల విద్యాశాఖాధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో ఆంగ్లం ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సీమల వెంకటరమణారావు, పద్మావతి దంపతులకు శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమణారావు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి నుంచి ఉద్యోగ విరమణ వరకు పాఠశాల అభివృద్ధి కోసం పరితపించారన్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడమే కాకుండా డ్రాఫౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ఎంతో శ్రమ పడ్డారని కొనియాడారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాల ఆవరణలో తరగతి గదుల భవనాలు నిర్మాణం చేపట్టడం, దేశనాయకులు విగ్రహాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. వెంకటరమణారావు ఎక్కడ పనిచేసిన అంకిత భావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికే వెన్ని తెచ్చారన్నారు. సీమల వెంకట రమణారావు గ్రామంలో పుట్టి చదువుకున్న పాఠశాలలో ఉద్యోగం చేపట్టి అదే పాఠశాలలో ఉద్యోగ విరమణ చేపట్టే అవకాశం అంత మందికి రాదని, అటువంటి అవకాశం రమణారావుకు దక్కిందన్నారు. సొంత నిధులతో పాఠశాలలో పనులు చేపట్టి విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించే వ్యక్తి రమణారావు మాస్టర్ అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేష్ పండా, రమణారావు కుటుంభసభ్యులు సాయిరామ్ జీ, దీపిక, సాయిదినేష్ సాయి ఉదయ్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు, రంగోయి, పెదంచల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ రమేష్, బల్ల సుభాష్, చిన్నం నాయుడు, కణితి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధు, పాఠశాల కమిటీ చైర్మన్ బాల శంకర్, రేణుకా దేవి, కె రమేష్, బి సుధారాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగీకారపై అవగాహన సదస్సు



**పలాస, అక్టోబరు 10(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోగల రెడ్డిక వీధి(చంద్రశేఖర్ దేవాలయంలో) వార్డులో మహిళా సంఘాల సభ్యులతో అంగికారపై శుక్రవారం అవగాహన కార్యక్రమంను సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్యలో నిలిచిపోయిన గృహాలను తిరిగి నిర్మించుకొని, గృహప్రవేశాలు చేసుకోవాలని కోరారు. పేద మధ్యతరగతి కుటుంబంలో గల ప్రజలకు విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నటువంటి క్రమంలో ప్రభుత్వం సూర్య ఘర్ ముక్తి యోజన పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి లబ్ధిదారుడు సూర్యగర్ పలకను ఇంటిపై కప్పు భాగంపై అమర్చి మీ విద్యుత్ బిల్లులో తగ్గించుకోవాలని తెలియజేశారు. ఈ పరికరం ఒక్కసారి పెట్టినచో 20 సంవత్సరాల వరకు విద్యుత్తు ఆదా చేసుకోవచ్చు అని తెలియజేశారు. వాడకానికి సరిపడా విద్యుత్తును డిస్కమల్ నుంచి వినియోగించుకోవచ్చని చెప్పారు. మిగిలిన బిల్లును ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని తెలియజేశారు. ఈ పథకం ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఫ్రీగా లభిస్తుందని, 2.%ా% లో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో గృహం లేని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, పథకం కేంద్ర ప్రభుత్వం 150000, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు మొత్తం కలిపి 2,50,000 ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో 65 మంది మహిళా సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సివెల్డిసి జగన్, ఆర్పి దేవి, డ్వాక్రా సంఘ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపల్లిలో విద్యార్థులకు కంటి పరీక్షలు

**కోటబొమ్మాళి, అక్టోబరు 10 (వార్త):** జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 185 మందికి డిజి పురం పిహెచ్సి ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్ కే దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం వున్న 21 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. విద్యార్థులకు "కంటి ఆరోగ్యం- సంరక్షణ"పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డా కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు కంటి ఆరోగ్యం సంరక్షించాల్సిన అవసరం ఉందని దృష్టిలోపానికి కంటి అద్దాలు సూచించినట్లయితే వాటిని నిరంతరం ధరించి ప్రతి ఏడాది కంటి పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే శాంత కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ జి చిన్నతల్లి, ఆరోగ్య పర్యవేక్షకులు డి భీమారావు, ఆరోగ్య కార్యకర్త బి లలిత, ఆశా కార్యకర్తలు ఎం చిన్నమ్మడు,కే లక్ష్మి ఎల్ మోహిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవోదయకు 'వివేకానంద' విద్యార్థి షర్మిత్



**మందస, అక్టోబరు 10(వార్త):** మందసలోని వివేకానంద విద్యానికేతన్‌లో చదువుతున్న విద్యార్థి బంగారు షర్మిత్ నవోదయకు ఎంపికయ్యాడు. 2025-2026 సంవత్సరంలో భాగంగా 9వ తరగతికి నవోదయకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు బోర ఉమాపతి చెప్పారు. వివేకానంద విద్యానికేతన్ పురోగతి సాధిస్తోందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను తీసుకెళ్ళడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పలువురు విద్యార్థులు తమ పాఠశాల నుంచి నవోదయకు ఎంపికయ్యారని తెలిపారు. నవోదయకు ఎంపికైన బంగారు షర్మిత్ వివేకానంద విద్యానికేతన్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యం శంకర్, కోటి, కామేష్, శ్రావణి, హరీష్, రామ్మోహన్, జగదీష్ అభినందనలు తెలిపారు.

## జి ఎస్ టి వస్తు ప్రదర్శన



**ఇచ్ఛాపురం, అక్టోబరు 10(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం ఆవరణలో సూపర్ జి ఎస్ టి పై ఎలక్ట్రానిక్ పరికరాల ప్రధర్శన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన స్లాబ్ ల యొక్క వివరములు తగ్గిన ధరల రేట్ లు కమిషనర్ రమేష్ వివరించారు. తదుపరి ట్రేడర్ ఉప్పాడ రాజు ప్రతి ఒక్క ఎలక్ట్రానిక్ పరికరాలు అనగా టి వి, ఫ్రిడ్జ్,వాషింగ్ మెషిన్,ఏ సి ల యొక్క రేట్లు వివరించారు.కార్యక్రమంలో 22 వ వార్డు కౌన్సిలర్ దిలీప్ , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టాక్స్ కాశీబుగ్గ కాళీ ప్రసాద్ మరియు కార్యాలయపు సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్. పి లు పాల్గొన్నారు.

## సత్యం మాస్టారి ఆశయసాధనకు కృషి

**మందస, అక్టోబరు 10(వార్త):** ఉద్యమ నాయకునిగా కొల్లి సత్యన్నారాయణ మాస్టారు(సత్యంమాస్టారు) సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. మందస పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో స్వర్గీయ కొల్లి సత్యంమాస్టర్ రెండవ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యంమాస్టారు యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంతంలో రైతాంగ, కార్మిక, ఉద్యోగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని అన్నారు. ముందుగా సత్యం మాస్టారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.దేవేంద్ర, ఎస్.జగ్గారావు, కె.కృష్ణారావు, బి.చిన్నడుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వైసీపీ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయండి




**పలాస, అక్టోబరు 10(వార్త):** వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గ సర్వసభ్య సమావేశం శనివారం కాశీబుగ్గలోని కీర్తన ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం నాలుగు గంటలకు మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో జరగనుందని జిల్లా అధికార ప్రతి నిధి బమ్మిడి దుర్యోధనరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ, నూతన కమిటీల నిర్మాణం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, రచ్చబండ, సంతకాల సేకరణ, స్థానిక సంస్థల ఎన్నికల ముందస్తు వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి వైయస్సార్సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## జీఎస్టీపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే బగ్గు

**పోలాకి, అక్టోబరు 10(వార్త):** దేశం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ ఆలోచన చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా పోలాకిలో శనివారం జరిగిన ఎలక్ట్రానిక్ అండ్ హెూమ్ అప్లయెన్సెస్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్నింటిపై జీరో శాతం జీఎస్టీ పరిమితం చేయడం అభినందనీయమని,వ్యవసాయ రంగం, వైద్య పరికరాలు, విద్యా సామగ్రి, ఆరోగ్య భీమా ఇవన్నింటిపై పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వడం, కొన్నింటిపై జీరో శాతం జీఎస్టీ పరిమితం చేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బొగాబందలో జల్లుమన్న జానపదం



**మందస, అక్టోబరు 10(వార్త):** కళాకారుల కాళ్ళ గజ్జెలు ఘల్లుమన్నాయి.. జానపదం జల్లుమనగా ప్రేక్షకులు మైమరచిపోయారు. పల్లెపదానికి ప్రజలు మురిసిపోయారు. మందస మండలంలోని బొగాబందలో శ్రీకాళీమాత ఈవెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన జానపదనృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీకాళీమాత ఈవెంట్స్ కళాకారులు సుధీష్ణ, మధు, సంధ్యారాణి, లిఖిత, దిలీప్, సందీప్, ధర్మారావు, సంతోష్, హరికృష్ణ, ప్రవీణ్ వికాస్, సాయి, మౌళి, మోహన్, వంశీ, సురేష్, దీపుల గజ్జెల సవ్వడికి నృత్యం తోడు కావడంతో కళామతల్లి ప్రతిరూపం ప్రతిబింబింభించింది. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న కళలకు శ్రీకాళీమాత ఈవెంట్స్ కళాకారులు జీవం పోశారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రౌతు దుర్యోధన, గ్రామపెద్దలు డోల తిరుపతి, పి.వెంకటరావు, డి.అప్పారావుతో పాటు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## రీసర్వేను సద్వినియోగపరుచుకోండి



**మెళియాపుట్టి, అక్టోబరు 10(వార్త):** భూముల రీ సర్వే ప్రక్రియలో ప్రతి రైతు భాగస్వామమై సద్వినియోగపరుచుకోవాలని మాజీ మండల ఉపాధ్యక్షులు, పాతపట్నం ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్ అన్నారు. శుక్రవారం వెంకటాపురం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు ప్రకారం మీ పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణము, సరిహద్దులు తదితర వాటిలలో ఏమైనా తప్పులుంట సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని సరి చేసుకోవాలని రైతులకు తెలియపరిచారు. ఈ సర్వే ప్రక్రియలో ఆయనతోపాటు విలేజ్ సర్వేయర్ మాధవి, విఆర్వో లలిత, పంచాయతీ కార్యదర్శి శంకర్, క్షేత్ర సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

## వంశధార నీరు సాధనకు ఉద్యమిద్దాం

**మందస, అక్టోబరు 10(వార్త):** వంశధార సాగునీరు సాధనకు రైతులంతా కలసి ఉద్యమిద్దామని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. బొడ్డపాడు గ్రామ రైతులతో వంశధార సాగునీరు సాధన కోసం రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోస్టు కార్డు ఉద్యమం, గ్రామపంచాయతీ తీర్మానాలు, గ్రామ కమిటీలు కోసం చర్చ జరిగింది. రైతులందరూ వంశధార సాగునీరు వచ్చేంత వరకు కలిసి పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, కొర్ల హేమారావుచౌదరి, దుంపల వైకుంఠరావు, కొవ్వూరు దశరధి, వెదుళ్ళ మాధవరావు, పెద్దింటి శశిధరవర్మ, వాయిలపల్లి వరప్రసాదరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే : కృష్ణ చైతన్య



**జలుమూరు, అక్టోబరు 10(వార్త):** సురవరం-తిమడాం క్లస్టర్ పరిధి, కొమనాపల్లి-బొడ్డపాడు క్లస్టర్ పరిధి కార్యకర్తలతో కార్యకర్తలతో కృష్ణ చైతన్య కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార దాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దొంగ హామీలతో ప్రజలను మోసం చేశాడు. అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరగా ఉన్నాయి. రానున్నది వైఎస్సార్సీపీ ప్రభుత్వమే" అని స్పష్టం చేశారు. కార్యకర్తలు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయమే ఖాయం అని ధర్మాన కృష్ణ చైతన్య నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉపాధ్యక్షులు బగ్గు రామకృష్ణ, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



**పలాస, అక్టోబరు 10(వార్త):** పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహనా సదస్సును పలాస మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంను వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అతిథులుగా మెడికల్ ఆఫీసర్ రమ్య, న్యాయవాదులు బి.కామేశ్వర రావు పట్నాయక్ , కే. దేవరాజు, బి. రవికుమార్, కే. లోకేశ్వర రావు, హెడ్ నర్స్ ఉమాదేవి పాల్గొని అవగాహన కలిపించారు .సీనియర్ న్యాయవాది బి.కామేశ్వర రావు పట్నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ ఒక్కరు మాసిక ఒత్తిడికి గురి అవుతున్నారని , శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం చాల ముఖ్యమని , తద్వారా జీవితం లో ముందుకు సాగగలరని , మానసిక రుగ్మతలు గలవారికి ఉచిత న్యాయ సహాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. డాక్టర్ రమ్య మాట్లాడుతూ మానసిక స్థితి సరిగా ఉంటేనే జీవితం లో ఏదైనా సాధించగలరని , ప్రతీ ఒక్కరికి ఒత్తిడి నుండి విడుదలకు యోగ , ప్రాణాయామము వంటి అంశాలు చాల సహకరిస్తాయని , అదేవిధంగా ప్రభుత్వం వారు మానసిక వేదన ఉన్నవారి కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 14416 ద్వారా ఆన్లైన్ లో సలహాలు, కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. చాలామంది మానసిక ఒత్తిడికి గురి అయి ఆత్మహత్యలకు పాలపడుతున్నారని, అది సరికాదని, విలువైన జీవితాన్ని చిన్న చిన్న విషయాలకు వొత్తిడిలకు గురి అయి ముగించరాదని , వివిధ రకాల మార్గాల ద్వారా మానసిక ప్రశాంతతను పొంది జీవితాలను విజయ మార్గాలవైపు తీసుకుని వెళ్లాలని , తద్వారా సమాజానికి కూడా ఉపయోగపడాలని తెలిపారు . ఈ కార్యక్రమం లో ఆసుపత్రి కి వచ్చిన రోగులు, ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాశీబుగ్గ సంతలో జీఎస్టీ 2.0 మేళా



**పలాస, అక్టోబరు 10(వార్త):** పలాస మున్సిపాలిటీలో జిఎస్టీ 2.0 లో భాగంగా "సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్" అవగాహన కార్యక్రమాన్ని కాశీబుగ్గ సంతమైదానంలో శుక్రవారం నిర్వహించారు. పలాస కాశీబుగ్గ పరిధి, కాశీబుగ్గ సంత మైదానంలో జిఎస్టీ పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాశీబుగ్గ కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆంధ్ర రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు విచ్చేసారు. ఈ సందర్భంగా ఎ.సి.టి.ఒ నాగరాజు మాట్లాడుతూ తగ్గిన జిఎస్టీ ఫలితాలు పేదవారికి చేరాలని, దీనిపైన అవగాహన వారికీ కలగాలని అన్నారు. కాబట్టి వర్తకులు అందరు తగ్గిన రేట్లను అందరు దృష్టిలో పెట్టుకుని అంతమేరకు మాత్రమే వస్తువులను విక్రయించాలని, లేకపోతె తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జిఎస్టీ 2.0 సందర్భంగా 4 స్లాబ్ లు ఉన్న పన్ను, 2 స్లాబ్ ల మేర కుదించబడిందని దీని వలన ప్రతీ పేదవాడికి సంవత్సరానికి ఏటా రూ. 15,000/- అదా చేసుకుంటారని అన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు తీసుకువెళ్ళే పుస్తకాలు, బ్యాగులు దగ్గర నుంచి తినే ఆహార పదార్థాల వరకు అన్ని రేట్లు తగ్గాయని అన్నారు. ఈ ఘనత కూటమి ప్రభుత్వానిదే అని ఘంటాపథంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పలాస కాశిబుగ్గ పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, ఎ.ఎమ్.సి. చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, 31 వార్డు ఇంచార్జ్ కోరికాన శంకరరావు, ముఖ్య నాయకులు, సంబంధిత అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 10(వార్త):** స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కన్వీనర్ గోపాల రావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నవ్య శ్రీ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. రేపటి భవిష్యత్ మన చేతుల్లో అనే అంశంపై పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుధాకర్, జనార్దన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






## యాప్‌ల భారం తగ్గించాలి

**ఇచ్ఛాపురం, అక్టోబరు 10(వార్త):** ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని ఏ పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్ వి ఆనంతాచార్యులు డిమాండ్ చేశారు.జి ఎస్ టి, స్వచ్ఛత వంటి బోధనేతర కార్యక్రమాలు నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి .శంకర్,ఉమా శంకర్,సత్యమయ్య, కామరాజు,వెంకట రమణ, నీల కంఠం,శశి భూషణ్ జోగేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఏ2 పరీక్షలకు ఏర్పాట్లు

**జలుమూరు, అక్టోబరు 10(వార్త):** ఈనెల 13నుంచి నిర్వహించిన ఎఫ్ఏ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. శుక్రవారం జలుమూరు ఎంఆర్సి కార్యాలయంలో క్వశ్చన్ పేపర్లు పాఠశాలలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని వివరించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన వివరాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు తెలియజేయడం జరిగిందన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఇది పంట పొలం కాదు ..చెరువే



**నరసన్నపేట, అక్టోబరు 10(వార్త):** పచ్చిక బయళ్లతో ఆకుపచ్చగా దర్శనమిస్తున్న ఈ చిత్రం పంట పొలం అనుకుంటే పొరపాటు పడినట్లే.. ఇది అక్షరాల చెరువు. నరసన్నపేట పట్టణ నడిబొడ్డున ఉన్న రాజుల చెరువు నిర్లక్ష్యానికి గురి కావడంతో ఈ దుస్థితికి చేరుకుంది. గడచిన నేటి పాలకులు దీనిపై సరైన దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు తెలిపారు. ఈ చెరువు అభివృద్ధికి ఇప్పటికైనా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

# మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టండి



**ఇచ్ఛాపురం, అక్టోబరు 10(వార్త):** శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పై యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ 4 అధ్యక్షుడు పల్లంటి చిరంజీవి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగాపట్టణంలోని పలు పాఠశాలల్లో మానసిక ఆరోగ్యం ఆవశ్యకతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యా సంబంధమైన విషయాలను చక్కని సమయపాలనతో సమన్వయం చేసుకోవడం ద్వారా ఒత్తిడికి దూరంగా ఉండవచ్చునని తెలిపారు. భావోద్వేగాలను నియంత్రించుకోవడం ద్వారా క్షణిక ఆవేశాలకు దూరంగా ఉంటూ విచక్షణతో కూడిన ఆలోచన పొందగలరని వివరించారు. సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటూ, కనీసం 8 గంటల నిద్రను శరీరానికి అందిస్తే పరిపూర్ణమైన మానసిక ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు, మానసిక ఆరోగ్యానికి ధ్యానం చాలా అవసరమని తెలిపారు. ఒత్తిడి నివారణకు కూడా ఏది ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

కుటుంబ సభ్యులతో ప్రేమపూర్వకమైన అనుబంధాలు అత్యంత ఉత్తమమైన మానసిక ఆరోగ్యాన్ని అందిస్తుందని, ఆందోళనలు ఆలోచనలు కుటుంబ సభ్యులతో పంచుకోవడం ద్వారా మనసు తేలికపడి ఆరోగ్యం సమకూతుందన్నారు. కృతజ్ఞతా భావం వ్యక్తపరుస్తూ , ఇతరులకు సహాయం చేస్తూ మనసును ఉల్లాసంగా ఉంచుతూ పరిపూర్ణమైన మానసిక ఆరోగ్యం పొందవచ్చునని స్పష్టం చేశారు.

## డిగ్రీ విద్యార్థులకు సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన




**పలాస, అక్టోబరు 10(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాలు ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి అధ్యక్షతన, కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ను అందిపుచ్చుకొని వ్యవసాయ క్షేత్రములు నిత్యవసర వస్తువులు, స్టేషనరీ, ఔషధాలు పాల పదార్థాలు గృహోపకరణ వస్తువులు పైన జీఎస్టీ తగ్గుదల వాటి వల్ల వచ్చిన ఆర్థిక ప్రయోజనాలను అందిపుచ్చుకొని, ఈ ప్రయోజనాలను ప్రతి విద్యార్థి మరొక 10 మందికి వివరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలాసలో ఉన్న ప్రతి కిరాణా షాపు బేకరీ పాల కేంద్రాలకు విద్యార్థులు అధ్యాపక బృందము సందర్శించి జీఎస్టీ పైన స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగాధిపతి పి.వెంకటరమణ, ఎన్.శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి.నరసింహులు, హిందీ అధ్యాపకురాలు డాక్టర్ వై.వెంకటలక్ష్మి, జి.శంకరరావు, బి.హేమరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయమైన ఉదయపురం రహదారి



**సంతబొమ్మాళి, అక్టోబరు 10(వార్త):** సంతబొమ్మాళి మండలం బోరుభద్ర – ఉదయపురం రహదారి లో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రహదారి పై ప్రయాణం చేసే వాహన చోదకులు ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. నిత్యం బస్సులు, ఆటోలు ద్విచక్ర వాహనాలు తిరిగే ఈ రహదారి లో బోరుభద్ర పెద్ద చెరువు సమీపంలో పూర్తిగా గోతుల మాయమైంది. చెరువు లోని నీరు రహదారి పైనుంచి ప్రవహించడం వల్ల సుమారు 200మీటర్లు పూర్తిగా శిదిలావస్థకు చేరుకుంది ఇక్కడ నీటి ప్రవాహం ఉండడం తో తారు రోడ్డు కు బదులు సిమెంట్ రహదారి నిర్మిస్తే ఈ పరిస్థితి రాదనే అభిప్రాయం స్థానికులు అంటున్నారు. అలాగే మలగాం –చెరువు గట్టు పేట మధ్యలో రోడ్డు పై రెండు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి ఒక మలుపు వద్ద రోడ్డు పైన పడిన గుంతలో తాటి కొమ్మలు పెట్టారు తప్ప ఆ గుంత ను కప్పి ఆలోచన చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారులు భవనాలు శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డు లో ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు లో ప్రమాదం జరగక ముందే గుంతలు పూడ్చిందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా ఉరుసు ఉత్సవం

**ఇచ్ఛాపురం, అక్టోబరు 10(వార్త):** స్థానిక లాలా పేట దర్గా లో ఉరుసు ఉత్సవం వైభవంగా జరిగింది.యజరత్ యుషుఫ్ షా టకీయార చందనోత్సవం ఘనంగా నిర్వహించారు.ఖురాన్ పఠనం తో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన మత గురువు ఖుల్ షరీఫ్ ప్రార్ధనలు చేశారు.ఎమ్మెల్యే బెందాలం అశోక్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ సౌజన్యం తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఫరీదుద్దీన్,అలీ, తాజు, అక్తర్, ఇర్ఫాన్, రఫీ, మోహిన్, జాకిర్, అలీం, అబ్దుల్లా, ఉస్మాన్, అహ్మద్ అలీ, కాసిమ్, జిలానీ, రఫిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న ముళ్ల లతలు



**నరసన్నపేట, అక్టోబరు 10(వార్త):** నరసన్నపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలకు ముళ్ళ తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ స్తంభాలు మీదుగా హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉండ డంతో వర్షాలు పడేటప్పుడు రాపిడికి గురి అయి నిప్పురవ్వలు రాలుతున్నాయని స్థానికులు తెలిపారు. జమ్ము కూడలి నుంచి సత్యవరం కూడలి వరకు ఉన్న పలు విద్యుత్ స్తంభాలు ఇలా దర్శనమిస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



## డబారుసింగిలో ఉచిత వైద్య శిబిరం

**మందస, అక్టోబరు 10(వార్త):** డబారుసింగి గ్రామంలో గ్రామపెద్దలు, యూత్ ఆధ్వర్యంలో జెమ్స్ హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడింది. శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన రోగులకు మందులు కూడా ఉచితంగా అందజేశారు. డబారుసింగి గ్రామప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు శిబిరాన్ని సద్వినియోగించు కున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రౌతు దుర్యోధన, వైస్ సర్పంచ్ సవర రాజు, ప్రసాద్, ఈశ్వరరావు, రవి, మాజీ సర్పంచ్ సవర సొంబారమ్మ, సవర చిన్నికృష్ణ, జెమ్స్ హాస్పిటల్ వైద్యం బృందం, సీహెచ్ఓ లక్ష్మీ, సృజన, కాంచన, పుష్పవతి, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దువ్వాడకు చైర్మన్ బల్ల గిరిబాబు పరామర్శ



**పలాస, అక్టోబరు 10(వార్త):** గుల్లలపాడు గ్రామం దువ్వాడ హేమ బాబు చౌదరి తండ్రి జగ్గు చౌదరి స్వర్గస్తులైనందున వారి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శుక్రవారం పరామర్శించారు. మృతుని కుటుంబీకులతో వారి ఆత్మ శాంతికు దేవుని ప్రార్థిస్తున్నానని, కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రామర్శించిన వారిలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు డి నాగు, వల్లభ వైకుంఠ రావు, బడగల మధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వర ఆలయ ఈవోగా ఏడుకొండలు



**జలుమూరు, అక్టోబరు 10(వార్త):** శ్రీముఖలింగేశ్వర ఆలయ ఈవోగా ఏడుకొండలు బాధ్యతలు చేపట్టారు. గతంలో విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారి ఆలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేసిన ఆయన, పదోన్నతిపై శ్రీముఖలింగేశ్వర ఆలయానికి ఈవోగా వచ్చానని తెలిపారు. అలయ అభివృద్ధికి థానా క్రుషి చైస్త అని తెలిపారు.

## శ్రీముఖలింగం ప్రధాన రహదారి గోతులమయం

**జలుమూరు, అక్టోబరు 10(వార్త):** ప్రముఖ పుణ్య క్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగానికి వెళ్లే ప్రధాన రహదారి చల్లవానిపేట సమీపంలో చెరువులు తలపించే విధంగా మారింది. ప్రధాన రహదారిపై కోతులు గోతులుగా ఏర్పడడంతో ద్విచక్ర వాహన ప్రయాణికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు వాహనదారులు తెలిపారు. ఇటువంటి ప్రధాన రహదారులు ఇలా ఉంటే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546